# అమెరికాలో ఆరు నెలలు

గొర్తి ఉమాదేవి

శారదాంబగారు దగ్గర బంధువుల సహాయంతో బొంబాయిలో ప్లేను ఎక్కగలిగారు.

ఆవిడకు తన అరవై ఏళ్ళ జీవితంలో ఇదే మొదటి సారిగా విమానం ఎక్కడం. ఎంతో కొత్తగా ఏదో వింతగా అనిపించ సాగింది.

శరవేగంతో ఆ విమానం ఎగురుతూనే వుంది. ఆమెలోని ఆలోచనలూ సాగుతూనే వున్నాయి. వెళ్లేది అమెరికా దేశం. చాలా ఏళ్ళ తరువాత తన ఇద్దరి కొడుకులనూ, తన కుమార్తెనూ, వారివారి సంసారాలను చూడబోతున్నది. ముఖ్యంగా తన చిన్నారి మనుమలను కళ్ళారా చూచి, మనసారా ఆనందించబోతున్నది.

శారదాంబగారి కొడుకులు నరహరి, సాగర్‌లు పై చదువులకని అమెరికా వెళ్లి, చదువులు పూర్తయి పెద్ద ఉద్యోగాలు దొరకడంతో అక్కడే స్వంత ఇళ్ళు అమర్చుకొని సెటిల్ అయ్యారు. కుమార్తె నీరజకి పెండ్లి చేసి, ఆమెనూ, ఆమె భర్త ప్రవీణ్‌ను కూడా అమెరికా తీసుకొని వెళ్ళారు ఆమె అన్నలు. వారివారి సంసారాలు ఎలా వున్నాయో, వాళ్ల దినచర్యలు ఏమిటో, అలవాట్లు ఎలా వున్నాయో! తన కోడళ్ళు అర్చన, సుప్రియ తనపట్ల ఎలా ప్రవర్తిస్తారో, తన పూజా పునస్కారాలు, జపతపాదులు వాళ్ళ ఇళ్ళలో సాగుతాయో లేదో! తమ ఇంట్లో అద్దెకున్న వారి కోడలు రెండేళ్ళు విదేశాలలో వుండి వచ్చిందట. మరి అన్నీ అక్కడి అలవాట్లే. డ్రస్సులు వేసుకుంటుంది. ఇంగ్లీషు తప్ప, తెలుగు మర్చిపోయినట్టే మాట్లాడుతుంది. జుట్టు పొట్టిగా కత్తిరించుకుంటుంది. ఇంట్లో చిన్న చిన్న గౌన్లు లాంటివి వేసుకొని తిరుగుతుంది. మరి తన కోడళ్ళు ఎలా వున్నారో. ఇంక కొద్ది గంటల్లో ఆ విచిత్రమైన దేశంలో అడుగు పెట్టబోతూ వుంది తను. వాళ్ళు ఎలా వుంటేనేం. తను తన చిన్నారి మనుమలతో ఆరు నెలలపాటు గడిపి తరువాత స్వదేశానికి తిరిగి వస్తుంది. ఇదే తన ఈ ఆరునెలల అమెరికా యాత్రలోని ప్రధానాంశము. ఇదే తన ఆశ, తన కోరిక అనుకుంది శారదాంబగారు.

ఎదురుచూసిన ఘడియ రానే వచ్చింది. 'ఎయిర్ పోర్ట్'లో తన సామాన్లు సేకరించుకొని బయటికి రాగానే తన వారందరూ ఆమెను చుట్టుముట్టేరు. శారదాంబ గారి కండ్ల వెంట ఆనందబాష్పాలు జలజల రాలేయి. కూతుర్ని, కొడుకుల్ని, కోడళ్ళని కౌగలించుకుంది. మనుమలను మనసారా గుండెలకు హత్తుకుంది. ఆమె మనసు ఆనందంతో పరవశించిపోయింది. ఆ రోజు ఆమె జీవితంలో ఒక అపూర్వ పర్వదినం. ఆ రోజు ఆ కుటుంబ పరివారమంతా నరహరి ఇంట్లో సమావేశమయ్యారు. వారి ఆప్యాయత, ఆదరణలకి ఆ మాతృమూర్తి హృదయం పొంగిపోయింది.




మరునాడే ఉగాది పండుగ. శారదాంబ గారికి మెలకువ వచ్చేసరికి శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం శ్రావ్యంగా వినిపిస్తూంది. కోడళ్ళిద్దరూ తలారా స్నానం చేసి పట్టు చీరలు కట్టుకొని పూజకి అన్నీ అమరుస్తూ వున్నారు. 'ఏమిటమ్మా! ఇక్కడ కూడా రేడియోలో సుప్రభాతం వేస్తారా?' అనడిగింది. 'లేదండీ కేసెట్ పెట్టాను' జవాబిచ్చింది పెద్దకోడలు అర్చన. అత్తగారి ప్రశ్నకు చిన్నగా నవ్వుకుంది అర్చన. మధ్యాహ్నం సాయంత్రం వరకూ మనుమలతో ఆనందంగా గడిపింది శారదాంబగారు. ఆమె చెప్పిన కథలూ, కబుర్లూ ఎంతో ఆసక్తితో విన్నారు పిల్లలు. సాయంత్రం చిన్నబ్బాయి సాగర్ 'అమ్మా! సంపూర్ణ రామాయణం సినిమా చూస్తావా?' అనడిగాడు. బోలెడంత ఆశ్చర్యం వేసిందావిడకి. 'అదేమిటిరా సంపూర్ణ రామాయణం సినిమా? ఇక్కడా? అదెలా సాధ్యం?' అనడిగింది. 'బయట సినిమా కాదమ్మా ఇంట్లోనే టి.వి.లో వేసుకోవచ్చు. ఆ సినిమా నీ కిష్టమని కేసెట్ తెచ్చాను ఇదిగో' అని

భోజనాలకి అందరూ డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చున్నారు. భోజనాలకి తెలుగు పిండివంటలూ, కూరలూ, పచ్చళ్ళూ, అన్నీ తయారుచేసి టేబుల్ మీద అమర్చారు అర్చన, సుప్రియ, నీరజా కలసి. ఆశ్చర్యం ప్రకటించింది శారదాంబగారు. 'ఏమిటి? మన వంటకాలన్నీ ఇక్కడ కూడా వండగల్గుతున్నారా?' ప్రశ్నించింది తినబోతూ. 'అవునమ్మా! ఓపిక వుండి చేసుకోవాలేగాని అన్ని వస్తువులూ ఇక్కడ దొరుకుతున్నాయి' అన్నాడు పెద్దబ్బాయి నరహరి. ఆ విడియోలగురించి తల్లికి వివరించాడు సాగర్. 'మన పురాణ గాథలు పిల్లలకి తెలియాలని ఇలాంటి సినిమాలు చూపిస్తుంటాము' అని చెప్పేడు. అమితమైన సంతోషము, తృప్తి కల్గాయి ఆవిడకు.

శారదాంబగారి సందేహాలు, భయాలు పటాపంచలయ్యాయి. ఆ రాత్రి పడుకోబోతూ అమెరికాలో ఆరు నెలలేం ఖర్మ, ఇంకొక ఆరు నెలలు గడిపి మరీ వెళతాను అనుకుంటూ తేలికపడిన హృదయంతో నిద్ర కుపక్రమించారు శారదాంబగారు. ●